సాక్షి నారాయణపేట

మంగళవారం : 25 : ఏప్రిల్ : 2023



నిర్లక్ష్యం వద్దు..
జ్వరమే కదా అని నిర్లక్ష్యం చేయకుండా సరైన **చికిత్స తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.**

వివరాలు 8లో ▸



విశేష స్పందన
ఆర్టీసీ కార్గో చేపట్టిన రాములోరి తలంబ్రాల పంపిణీకి విశేష స్పందన లభించింది.

వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
38.3 /24.3

వాతావరణం
ఉదయం నుంచే ఎండ తీవ్రత ఉంటుంది. ఆకాశం నిర్మలంగా ఉంటుంది. వేడిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

భూ సమస్యలు మండలాల్లో పరిష్కరించాలి



నారాయణపేట: ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. ప్రధానంగా భూ సమస్యలపై ఫిర్యాదులు వస్తున్నయని, వాటిని మండల స్థాయిలోనే పరిష్కరించాలని చెప్పారు. రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే పరిష్కారం దొరుకుతుందని అన్నారు. వివిధ శాఖలకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులను ఆయా శాఖలకు పంపించి పరిష్కరించేలా చూస్తామని ఫిర్యాదుదారులకు కలెక్టర్ భరోసానిచ్చారు.

నేడు క్రిష్ణా.. మాగనూర్ మండలాల్లో కలెక్టర్ పర్యటన
జిల్లాలోని క్రిష్ణా, మాగనూర్ మండలాల్లో మంగళవారం కలెక్టర్ పర్యటించనున్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలిస్తారు. క్రిష్ణా తహసీల్దార్ కార్యాలయంలో 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకు, మాగనూర్ మండలంలో 12 గంటల నుంచి ఒంటిగంట వరకు ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తారు.

పోలీసు గ్రీవెన్స్‌కు ఆరు ఫిర్యాదులు

నారాయణపేట రూరల్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణికి ఆరు ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదుదారులతో ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు నేరుగా మాట్లాడి, వారి సమస్యలు, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అర్జీలను స్వీకరించి సంబంధిత ఎస్‌ఐలకు బదిలీ చేశారు. వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు.

వడ్లు క్వింటా ధర రూ.2,176

నారాయణపేట: స్థానిక మార్కెట్ యార్డు చరిత్రలోనే వడ్లు సోనామసూరి, హంస ధర సోమవారం గరిష్ఠంగా రూ.2,176 ఒకే రేటు పలకడంతో రికార్డు సృష్టించింది. కనిష్ఠంగా హంస రూ.1,425 పలుకగా, సోనామసూరి రూ.1400 పలికింది. ఆముదాలు గరిష్ఠంగా రూ.5,439, కనిష్ఠంగా రూ.5,409, పెసలు గరిష్ఠంగా రూ.8,012, కనిష్ఠంగా రూ.7,425, వేరుశనగ గరిష్ఠంగా రూ.5,009, కనిష్ఠంగా రూ.4,669, జొన్నలు రూ.5,165, ఎర్ర కందులు రూ.8,129, చింతపండు గరిష్ఠంగా రూ.5,559, కనిష్ఠంగా రూ.3,069, చింతపండు బోటు రూ.1400 పలికాయి. పత్తి రూ.7,750, కనిష్ఠంగా రూ.4,500లు పలికింది.

నేటి నుంచి ఓపెన్ పరీక్షలు

నారాయణపేట రూరల్: సార్వత్రిక విశ్వవిద్యాలయం ద్వారా చదువుకుంటున్న విద్యార్థులకు మంగళవారం నుంచి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఓపెన్ టెన్త్ కోసం 532 మంది, ఓపెన్ ఇంటర్‌కు 812మంది దరఖాస్తు చేసుకున్నారు. వారి కోసం మూడు ఎస్‌ఎస్‌సీ, నాలుగు ఇంటర్‌కు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. డీవీఎం, గర్ల్స్ స్కూల్, నారాయణ పాఠశాలల్లో పదవ తరగతి, గురుకుల, శ్రీసాయి, లిటిల్‌స్టార్స్, ప్రభుత్వ గ్రౌండ్ స్కూల్‌లో ఇంటర్ విద్యార్థులకు కేటాయించారు. పరీక్షలకు గాను ఏడుగురు సీఎస్‌లు, ఏడుగురు డీఓలు, ఏడుగురు సీసీలను నియమించగా, 80 మంది ఇన్విజిలేటర్లు విధుల్లో పాల్గొననున్నారు. మే 2న టెన్త్, మే 3వ రకు ఇంటర్ పరీక్షలు కొనసాగుతాయి. పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాటు పూర్తి చేసినట్లు టాస్ జిల్లా కో ఆర్డినేటర్ యాదయ్యశెట్టి తెలిపారు. పరీక్షల ఏర్పాట్లను డీఈఓ లియాకత్ అలీ పరిశీలించారు.

నేడు పీయూలో మెగా జాబ్‌మేళా

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక పాలమూరు యూనివర్సిటీలోని లైబ్రరీలో మంగళవారం మెగా జాబ్‌మేళా ఉంటుందని పీఆర్‌ఓ అర్జున్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పీజేకే టెక్నాలజీస్ సౌజన్యంతో 21 కంపెనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. మొత్తం 1,200 ఉద్యోగాల కోసం అభ్యర్థులు ఉదయం తొమ్మిది గంటలలోపు ఇక్కడికి చేరుకోవాల్సి ఉంటుందని సూచించారు. డిగ్రీలో బీఎస్సీ, బీకాం, బీఏ, బీఈడీ, బీ-ఫార్మసీ, బీబీఏలో ఉత్తీర్ణులైన వారు అర్హులని పేర్కొన్నారు. అలాగే ఎంబీఏ, ఎంబీఏ, ఎం-ఫార్మసీ పూర్తి చేసిన వారు సైతం హాజరుకావొచ్చని తెలిపారు. అభ్యర్థులు www.c2hire.com వెబ్ సైట్‌లో నమోదు చేసుకోవాలని, ఎంపికైన వారు హైదరాబాద్‌లో పని చేయాల్సి ఉంటుందని, ఏడాదికి రూ.1.5 లక్షల నుంచి రూ.ఆరు లక్షల వరకు వస్తుందని వివరించారు.

కేవలం 36 మిల్లులకే

యాసంగి సీజన్ ధాన్యం కేటాయించిన అధికారులు



మాగనూరులో ఆరబోసిన వరి ధాన్యం

- 62 మిల్లులు ఉండగా 36కు మాత్రమే కేటాయింపులు
- ధాన్యం సేకరణ లక్ష్యం 2.24 లక్షల మెట్రిక్ టన్నులు
- నాలుగు సీజన్లలో సీఎంఆర్ పెండింగ్ ఉన్న మిల్లులు బ్లాక్ లిస్ట్‌లోకి

మద్దూరు: జిల్లాలో యాసంగి వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఐకేపీ, పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాలను మండలాల వారీగా అధికారులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాలను నుంచి ధాన్యాన్ని తరలించేందుకు జిల్లాలో 62 మిల్లులు ఉండగా 36 మిల్లులకు మాత్రమే అధికారులు ధాన్యం కేటాయింపులు కేటాయించారు. నాలుగు సీజన్లలో సీఎంఆర్ పెండింగ్ ఉన్న మిల్లులను బ్లాక్ లిస్టులో పెట్టాలని పౌరసరఫరాల శాఖ ఆదేశించింది. ఈ నేపథ్యంలో ధాన్యం సేకరణ లక్ష్యం భారీగా ఉండడం, మిల్లులను తక్కువగా కేటాయించడంతో కేంద్రాల్లో కొన్న ధాన్యం తరలించేందుకు మిల్లుల కొరత ఏర్పడే అవకాశం ఉంది. ఇదిలాఉండగా గతంలో అక్రమాలకు పాల్పడిన మిల్లులకు ధాన్యం కేటాయించాలని మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు ఒత్తిడి తెస్తుండడంతో అధికారులకు తలనొప్పిగా మారింది.

లక్ష్యం చేరేనా?
సీఎంఆర్ పెండింగ్ ఉన్న మిల్లులతో పాటు, సీఎంఆర్ అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన మిల్లులకు ధాన్యం అందించవద్దని పౌరసరఫరా శాఖ నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. దీంతో జిల్లాలో 62 మిల్లులుంటే ఈ సీజన్‌లో కేవలం 36 మిల్లులకు మాత్రమే అధికారులు ధాన్యం కేటాయించారు. గతంలో 61 మిల్లులకు ధాన్యం కేటాయిస్తేనే ధాన్యం, మిల్లుల బయట నిల్వ చేయాల్సిన పరిస్థితి ఉండేది. గతంలో 1.7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే సేకరణ చేసినా అధికారులు ఈ సీజన్‌లో 2.42 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యం పెట్టుకున్నారు. ఈ మిల్లుల ఏ మాత్రం సరిపోతాయనే అనుమానం వ్యక్తమవుతుంది.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

జిల్లాలో ఈ యాసంగి సీజన్‌లో 48,672 హెక్టార్లలో వరి సాగు కాగా 3,38,757 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఇందులో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వార 2,42,496 మెట్రిక్ టన్నుల ధాన్య సేకరించాలని నిర్ణయించారు. ఇందులో సెర్ప్ ఆధ్వర్యంలో 44, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 53, మెప్మా 4, ఏఎంసీ 2 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని అధికారులు నిర్ణయించారు. ఇందులో ఇప్పటి వరకు మక్తల్ నియోజకవర్గంలో కొన్ని కేంద్రాలను అధికారులు ఇప్పటికే ప్రారంభించారు.

గతంలో 61 మిల్లులకు..

జిల్లాలో 56 ముడిబియ్యం(రా రైస్), 5 ఉప్పుడు బియ్యం(బాయల్డ్ రైస్) మిల్లులు ఉన్నాయి. 2020-21 యాసంగి నుంచి 2022-22 యాసంగి సీజన్లకు సంబంధించి సీఎంఆర్ బకాయి ఉన్న మిల్లలకు ఈ సీజన్‌లో ధాన్యం కేటాయించవద్దని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలో 2021-22 వానాకాలం సీజన్‌లో 61 మిల్లులకు ధాన్యం కేటాయించగా సీఎంఆర్ సేకరణ గడువు పూర్తయినా కొన్ని మిల్లులు ఆలస్యంగా అందించాయి. ఇంకా 2021-22 వానాకాలంలో సీఎంఆర్ 5,292 మెట్రిక్ టన్నుల ధాన్యం అందించాల్సి ఉంది. 2021-22 యాసంగి సీజన్‌కు సంబంధించి 32,834 మెట్రిక్ టన్నుల సీఎంఆర్‌ను మిల్లర్లు అప్పగించాల్సి ఉంది. ఈ గడువు ఈనెల 30న ముగియనుంది.

పరిస్థితి మెరుగుపర్చుకుంటే అనుమతి ఇస్తాం



మిల్లర్లు గత యాసంగిలో సీఎంఆర్‌కు అందజేయాల్సిన బియ్యాన్ని అందజేసి పరిస్థితిని మెరుగుపర్చుకోవాలని కలెక్టర్ మిల్లర్లను ఆదేశించారు. వారం గడువు ఉంది కాబట్టి, బియ్యాన్ని సీఎంఆర్‌కు అప్పగిస్తే ఈ యాసంగి ధాన్యం అందజేస్తామని కలెక్టర్ మిల్లర్లకు సూచించారు.
– శివప్రసాద్‌రెడ్డి, డీఎస్‌ఓ, నారాయణపేట

మురుగునీటిని బయట పారనీయవద్దు

ధన్వాడ: గ్రామాల్లో మురుగునీరు వీధుల్లో, ఆరుబయట పారనీయవద్దని అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిట్టల్ సూచించారు. సోమవారం ధన్వాడ మండలంలోని రామకిష్టాయిపల్లి, దుదుగు తండా గ్రామ పంచాయతీలను ఆయన సందర్శించారు. ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ప్రతి ఇంటికి ఇంకుడుగుంతలు నిర్మించాలని చెప్పారు. దుదుగుతండాలో నర్సరీ నిర్వహణ సరిగా లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రామకిష్టాయిపల్లిలో ప్రకృతి వనంలో పని చేసేందుకు ఒకరిని పెట్టాలని సర్పంచ్‌కు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సద్గుణ, ఎంపీఓ సుదర్శన్, సర్పంచు మాధవరెడ్డి, కార్యదర్శి కవిత తదితరులు పాల్గొన్నారు.



రామకిష్టాయిపల్లిలో డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిట్టల్

సరిహద్దు చెక్‌పోస్టులపై డీజీపీ ఆరా



వీసీలో మాట్లాడుతున్న ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు

నారాయణపేట రూరల్: జిల్లా చుట్టూ ఏర్పాటు చేసిన సరిహద్దు చెక్‌పోస్టులపై డీజీపీ సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు జిల్లాలో నాలుగు చెక్‌పోస్టులను గతంలో ఏర్పాటు చేసిన చోటనే కొనసాగిస్తామని చెప్పారు. కర్ణాటక ఎన్నికల సందర్భంగా గట్టి నిఘా ఏర్పాటు చేస్తామని, సరిహద్దుల్లో జరిగే వ్యాపారాలపై దృష్టి సారిస్తామన్నారు. నకిలీ విత్తనాల నిర్మూలనకు అనుసరించాల్సిన పద్ధతులు, గుట్కా, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల అమ్మకాలపై దృష్టి సారించే విధంగా అన్ని పీఎస్‌లకు సమాచారం ఇస్తామన్నారు. వర్టికల్‌ల అమలు చక్కగా జరుగుతుందని, ఆన్‌లైన్ నమోదు వేగవంతంగా చేయిస్తున్నామని చెప్పారు. నేరాల నియంత్రణకు తగిన సూచనలు చేస్తున్నామని, సీసీ కెమెరాల వినియోగంపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. షీటీమ్స్, కళాజాత బృందాల పనితీరు బాగుందన్నారు. ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు చేసి వాహనదారులను చైతన్య పరుస్తున్నామని చెప్పారు.

అంకితభావంతో విధులు నిర్వహించాలి
విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పలువురు పోలీసు అధికారులు, సిబ్బందిని అభినందించి కేపీఐ రివార్డ్స్ అందజేశారు. వివిధ ఫంక్షనింగ్ వర్టికల్స్‌లో ప్రతిభ చూపిన 14మందిని ఎంపిక చేశారు. ప్రశంసాపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు వెంకటేశ్వర్‌రావు, సత్యనారాయణ, సీఐ రవిబాబు, ఎస్‌ఐ శ్రీనివాస్‌రావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు పరిష్కరించాలి

పీఎస్‌లలో నమోదైన ప్రతీ కేసును క్షుణంగా పరిశీలించి వేగంగా పరిష్కరించేందుకు ఎస్‌హెచ్‌ఓలు కృషిచేయాలని ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు సూచించారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని సీఐ, ఎస్‌లతో సోమవారం నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ల వారీగా గ్రేవ్, నాన్ గ్రేవ్ పెండింగ్ కేసుల వివరాలు, ఆలస్యానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. కేసుకు సంబంధించిన ప్రతి ఆధారాన్ని సంపాదించి, నేరస్తులకు కోర్టు ద్వారా తగిన శిక్ష పడే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సైబర్ నేరాలు, చోరీలబారిన పడకుండా యువత, గ్రామీణ ప్రజలకు తగిన అవగాహన కల్పించాలని, డయల్ 100 ఫిర్యా దులను వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు. సమావేశంలో అడీషనల్ ఎస్పీ నాగేంద్రుడు, డీఎస్పీలు సత్యనారాయణ, వెంకటేశ్వర్‌రావు, సీఐలు రవిబాబు, సీతయ్య, శ్రీకాంత్‌రెడ్డి, కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు



జిల్లా ఆస్పత్రిలో ఆర్థోపెడిక్ థియేటర్‌ను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ వనజ

నారాయణపేట: జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించడానికి ప్రభుత్వం సౌకర్యాలు కల్పిస్తున్నదని జెడ్పీ చైర్‌పర్సన్ వనజ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కలెక్టర్‌తో కలిసి రోగుల సహాయకుల వెయిటింగ్ హాల్, ఆర్థో థియేటర్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ శ్రీహర్ష మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే రోగుల సహాయకులు వేచి ఉండేందుకు విశ్రాంతి కోసం రూ.10లక్షలతో షెడ్ నిర్మించినట్లు తెలిపారు. రూ.30లక్షల నిధులతో ఆర్థోపెడిక్ థియేటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్థానికంగా రోగులకు వైద్యసేవలు పొందవచ్చన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యసేవలు ఉచితంగా పొందాలని జిల్లా ప్రజలకు తెలిపారు. వివిధ విభాగాల్లో 14మంది వైద్యులను నియమించడం జరిగిందన్నారు. వైద్యుల కోసం గదులను ఏర్పాటు చేశామన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రంజిత్‌కుమార్, వైద్యులు పావని ఉన్నారు.

ఇంటి నిర్మాణానికి రూ.10లక్షలు ఇవ్వాలి



జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

నారాయణపేట టౌన్: ఇళ్లస్థలాలు లేని వారికి, స్థలాలు మంజూరు చేయాలని, స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణానికి రూ.10లక్షలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సాయం చేయాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సెంటర్ చౌక్ నుంచి నర్సిరెడ్డి చౌరస్తా వరకు భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం ప్రజాపంథా పార్టీ డివిజన్ కార్యదర్శి కె.కాశీనాథ్ అధ్యక్షతన జరిగిన ధర్నా కార్యక్రమంలో ముఖ్యవక్తగా కార్యదర్శి బి.రాము మాట్లాడారు. కొత్త రేషన్‌కార్డులు ఇవ్వాలని, ఇప్పటికే నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూం వెంటనే లబ్ధిదారులకు అందించాలని డిమాండ్ చేశారు. కొత్త రేషన్‌కార్డులు ఇవ్వాలని కోరారు. పట్టణ కార్యదర్శి కెంచి నారాయణ, జిల్లా నాయకులు సలీం, కాశీశ్వర్, యాదగిరి, నారాయణ, నర్సింహులు, సౌజన్య, అరుణోదయ కృష్ణ, బాలకృష్ణ, ఎంపీటీసీ సునీత పాల్గొన్నారు. అంతకుముందు తహసీల్దార్ దానయ్యకు సర్వే చేసిన దరఖాస్తులు అందజేశారు.

అగ్రిగోల్డ్ భూములపై విచారణ



నర్వ తహసీల్దార్ కార్యాలయంలో విచారణ చేస్తున్న ఏపీ సీఐడీ డీఎస్పీ

నర్వ: అగ్రి గోల్డ్ సంస్థకు చెందిన భూములపై నర్వ మండలంలో సోమవారం ఆంధ్రప్రదేశ్ సీఐడీ విభాగం అధికారులు విచారణ చేపట్టారు. ఈ విచారణలో భాగంగా సీఐడీ డీఎస్పీ లక్ష్మీనారాయణ నర్వ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ దయాకర్‌రెడ్డితో పూర్తి సమాచారం అడిగి తెలుసుకున్నారు. మండలంలోని రాయికోడ్, జక్కన్నపల్లి శివారులో గల 163 ఎకరాల అగ్రి గోల్డ్ భూములకు సంబంధించి కోర్టు పరిధిలో ఉన్న నేపథ్యంలో ఎలాంటి క్రయవిక్రయాలు చేయరాదని అన్నారు. ప్రస్తుతం ఈ భూములు ఎవరి ఆధీనంలో ఉన్నాయి? భూములు అన్యాక్రాంతం అయ్యాయా? ప్రస్తుతం భూముల మార్కెట్ విలువ ఎంత? అని విచారణ చేశారు. ఈ భూములను విక్రయించేందుకు కొంతమంది దళారులు ప్రయత్నిస్తున్నారని, ఇవి కోర్టు పరిధిలో ఉన్న పరిస్థితులో ఎలాంటి క్రయవిక్రయాలు చేపట్టరాదని చెప్పారు. భవిష్యత్‌లో భూముల వేలం కోర్టు పరిధిలోనే చేపడతారని ముందుగా రైతులకు మొదటి ప్రాధాన్యత కల్పించే అవకాశం ఉంటుందన్నారు. ఏపీ సీఐడీ విభాగం డీఎస్పీ లక్ష్మీనారాయణ, సీఐ శ్రీనివాసులు, ఇతర సిబ్బంది, నర్వ ఎస్‌ఐ విక్రమ్ తదితరులున్నారు.

ప్రతినిధుల సభను జయప్రదం చేద్దాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి

నారాయణపేట: బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా బీఆర్‌ఎస్ వ్యవస్థాపకులు సీఎం కేసీఆర్, పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు నారాయణపేట అసెంబ్లీ నియోజకవర్గ ప్రతినిధుల సభను మంగళవారం సింగారం చౌరస్తాలోని పార్టీ జిల్లా కార్యాలయంలో 3,500 మందితో నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయం 8.30గంటలకు గ్రామాల్లో, మున్సిపల్ వార్డుల్లో పార్టీ బాధ్యులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలందరితో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించాలన్నారు. పార్టీ ప్రతినిధులందరూ 10గంటల వరకు జిల్లా పార్టీ కార్యాలయానికి చేరుకొని మండలాల వారీగా తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. 10:45 గంటలకు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులు ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ, జిల్లా పార్టీ ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ వనజమ్మతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరిస్తారని తెలిపారు. ఆ తర్వాత ఏడు అంశాలపై వ్యవసాయం- సాగునీరు, సామాజిక భద్రత, విద్య, వైద్యం-ఉపాధి, పల్లె-పట్టణ ప్రగతి, దళితుల సంక్షేమం-దళితబంధు, నిత్యావసర ధరలపై చర్చ, రాజకీయ తీర్మానం అంశాలపై తీర్మానం చేసి పార్టీ అధిష్ఠానానికి పంపుతామన్నారు. ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సింగిల్ విండో అధ్యక్షుడు, డైరెక్టర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్లు, రైతుబంధు సమన్వయ సమితి అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, గ్రామ సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, మున్సిపాలిటీ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు, పార్టీ ప్రతినిధులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె అనసూయ, మార్కెట్ చైర్‌పర్సన్ మొసటి జ్యోతి, ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ, మండల పార్టీ అధ్యక్షుడు విజయ్‌సాగర్, వేపూరి రాములు పాల్గొన్నారు.

నేడు 'నిరుద్యోగ మార్చ్'

- బీజేపీ ఆధ్వర్యంలో టీటీడీ కల్యాణ మండపం నుంచి ర్యాలీ ప్రారంభం
- క్లాక్‌టవర్ వద్ద సభ.. హాజరుకానున్న పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి
- ఉమ్మడి జిల్లా నుంచి 50వేల మంది తరలింపు
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన 'కమల' దళం

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: పాలమూరు వేదికగా భారతీయ జనతా పార్టీ రెండో విడతలో మంగళవారం చేపట్టిన నిరుద్యోగమార్చ్‌కు నేతలు అన్నీ సిద్ధం చేశారు. ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నారాయణపేట, జోగులాంబ గద్వాల, వనపర్తి జిల్లాల నుంచి నిరుద్యోగులు, యువతను అధికసంఖ్యలో తరలించేలా పార్టీ యంత్రాంగం వాహనాలు సమకూర్చింది. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌తో పాటు పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఏపీ జితేందర్‌రెడ్డి తదితరులు హాజరుకానున్నారు.

మధ్యాహ్నం 3 గంటలకు ర్యాలీ షురూ
మహబూబ్‌నగర్‌లోని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కల్యాణ మండపం నుంచి బండి సంజయ్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం మూడు గంటలకు ర్యాలీ ప్రారంభం కానుంది. ప్రభుత్వ బాలుర కళాశాల, అంబేద్కర్ చౌరస్తా, అశోకటాకీస్ మీదుగా క్లాక్‌టవర్ వద్దకు చేరుకోనున్నారు. ఆ తర్వాత అక్కడ ఏర్పాటు చేసిన సభలో నిరుద్యోగులు, యువతను ఉద్దేశించి ముందుగా జితేందర్‌రెడ్డి, అరుణ ప్రసంగించనున్నారు. ఆ తర్వాత బండి సంజయ్ మాట్లాడనున్నారు.

సుమారు 50 వేల మంది తరలింపు..
మహబూబ్‌నగర్‌లోని నిర్వహిస్తున్న నిరుద్యోగమార్చ్ విజయవంతానికి బీజేపీ నేతలు పక్కా వ్యూహంతో ముందుకు సాగుతున్నారు. కొన్ని రోజులుగా పాలమూరు యూనివర్సిటీ, స్టడీ సెంటర్లు తదితర ప్రాంతాల్లో బీజేపీ నేతలు పర్యటిస్తూ నిరుద్యోగ మార్చ్‌ను విజయవంతం చేయాలని కోరారు. ప్రధానంగా టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ అంశాన్ని ప్రస్తావిస్తూ నిరుద్యోగం, ఉద్యోగ నియామకాల్లో యువతకు అన్యాయం జరుగుతోందని.. దీనిపై చేపట్టిన పోరుకు మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. దీంతో పాటు పార్టీ పటిష్టమే లక్ష్యంగా బీజేపీ గ్రామస్థాయి నుంచి బూత్ కమిటీలను ఏర్పాటు చేయగా.. వీరి సేవలను వినియోగించుకుంటోంది. ఒక్కో బూత్ కమిటీ నుంచి కనీసం పది మంది నిరుద్యోగులు, యువతను నిరుద్యోగమార్చ్‌కు తరలించేలా ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 835 వరకు బూత్ కమిటీలు ఉండగా.. సుమారు 10వేల మంది నిరుద్యోగ మార్చ్‌లో పాల్గొననున్నట్లు నేతలు అంచనా వేస్తున్నారు. అదేవిధంగా ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాల నుంచి కనీసం 3వేల మందిని తరలించేలా 60 వరకు బస్సులు, 600 వరకు ఇతర వాహనాలను సమకూర్చినట్లు తెలుస్తోంది. ఈ మేరకు బీజేపీ మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాల అధ్యక్షులు ఆయా నియోజకవర్గాల్లోని నిరుద్యోగులు, యువత సమీకరణ పనుల్లో నిమగ్నమైనట్లు తెలుస్తోంది.

క్లుప్తంగా

అప్పుల బాధతో రైతు బలవన్మరణం

మక్తల్: అప్పుల బాధతో ఓ రైతు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. వివరాలిలా.. మండలంలోని వనాయికుంటకు చెందిన కృష్ణ(30) వ్యవసాయం చేయగా కలిసిరాలేదు. దీంతో పంటల సాగు కోసం చేసిన అప్పులు అధికం కావడంతో ఎలా తీర్చాలో అని మదన పడుతుండేవాడు. ఈ క్రమంలో సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కృష్ణకు భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య


రమేష్(ఫైల్)

పాన్‌గల్: ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం మండలంలో చోటుచేసుకొంది. ఎస్‌ఐ నాగన్న తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ మండలం పెద్దముద్దనూర్‌కు చెందిన రమేష్(28) దంపతులు మండలంలోని చింతకుంట గ్రామ శివారులోని కోళ్లఫారంలో కూలీ పనిచేస్తున్నారు. సోమవారం తెల్లవారుజామున భార్యాభర్తలు సంసార విషయంలో గొడవపడ్డారు. క్షణికావేశానికి గురైన రమేష్ కోళ్ల ఫారం సమీపంలో వేపచెట్టుకు చీరతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి సోదరుడు బాలచంద్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. మృతుడికి భార్య వసంత, ఇద్దరు ఆడపిల్లలు, కుమారుడు ఉన్నారు.

ఆర్టీసీ బస్సు, బైక్ ఢీ: వ్యక్తి మృతి


పర్వతాలు (ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం: ఆర్టీసీ బస్సు, బైక్ ఎదురెదురుగా ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మున్సిపాలిటీ పరిధిలోని నల్లవాగు సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపిన సమాచారం మేరకు.. గుడిపల్లికి చెందిన పర్వతాలు (45) వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. పని నిమిత్తం బైక్‌పై బిజినేపల్లికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా నల్లవాగు సమీపంలో బస్సు ఎదురుగా ఢీకొంది. పర్వతాలుకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని జనరల్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

బిజినేపల్లి: మండలంలోని మంగనూర్ చెందిన మహ్మద్ బాబా(42) సోమవారం ఉదయం బైక్‌పై వెళ్తుండగా పాలెంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టడంతో మృతి చెందాడు. బాబాకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు చికిత్స కోసం నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే పరిస్థితి విషమించినట్లు వైద్యులు గుర్తించడంతో మెరుగైన చికిత్సకు హైదరాబాద్‌కు తరలిస్తుండగానే మార్గ మధ్యలోనే మరణించాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కృష్ణ ఓబుల్‌రెడ్డి తెలిపారు.


ఉపాధ్యాయుడి మృతి

బల్మూర్: మండలంలోని కొండనాగుల వద్ద ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదంలో గాయపడిన లింగాల గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు హతిరాం సోమవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ శివానందంగౌడ్ తెలిపారు. మృతుని కుమారుడు అభిలాష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కారు ఢీకొని యువకుడు..


నాగర్‌కర్నూల్ క్రైం: ఆస్పత్రిలో చికిత్సపొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఎస్సై విజయ్‌కుమార్ తెలిపిన సమాచారం మేరకు.. జిల్లాకేంద్రానికి చెందిన కాళ్ల శివుడు (30) ఆదివారం ఉదయం ద్విచక్రవాహనంపై వస్తుండగా నెల్లికొండ గేటు వద్ద కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే శివుడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతిచెందాడు. సంఘటనకు సంబంధించి మృతుడి తమ్ముడు నరేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఇతడికి శుక్రవారం రోజు కుమారుడు జన్మించాడు. ఇంతలోనే మృతిచెందడంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

చికిత్స పొందుతూ వ్యక్తి..


రాములు(ఫైల్)

వెల్దండ: మండలంలోని కొట్రకు చెందిన శ్యాంపూరి రాములు(40) అనే వ్యక్తి హైదరాబాద్‌లో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. రాములు ద్విచక్ర వాహనంపై నుంచి అదుపుతప్పి ఈనెల 18న కొట్రగేట్ సమీపంలో కింద పడిపోయాడు. చికిత్స నిమిత్తం యెన్నమ్ ఆస్పత్రిలో చేర్చారు. తలకు తీవ్రమైన గాయం కావడంతో కోమాలోకి వెళ్లాడు. మెరుగైన వైద్యం కోసం నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. సోమవారం చికిత్స పొందుతూ మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

నిర్లక్ష్యం వద్దు.. నివారణే ముఖ్యం



- ఏడేళ్లలో 138 కేసులు నమోదు
- నేడు ప్రపంచ మలేరియా దినోత్సవం

పాలమూరు: జ్వరమే కదా అని తేలికగా తీసు కుంటే అది మలేరియా కావచ్చు.. అంతకు మించి ప్రాణాంతకంగా మారొచ్చు. సరైన సమయంలో సరైన చికిత్స తీసుకుంటే వ్యాధి తీవ్రతను తగ్గించి ప్రమాదం నుంచి బయటపడొచ్చు. కానీ చికిత్స కన్నా వ్యాధి నివారణే ముఖ్యమనే విషయం తెలుసుకోవాలి. ఐదేళ్ల నాటి గణాంకాలతో పోల్చితే జిల్లాలో ప్రస్తుతం చాలా మెరుగైన పరిస్థితి కనిపిస్తోంది. అయినప్పటికీ భవిష్యత్‌లో ఇది పునరావృతం కాకుండా ఉండాలంటే నివారణ చర్యలే ప్రధానం. మంగళవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా సాక్షి ప్రత్యేక కథనం.

వ్యాధి ఇలా సోకుతుంది..

ఎనాఫిలిస్ అనే ఆడదోమ కుట్టినపుడు మనిషి శరీరంపై ప్లాస్మోడియం పారసైట్ అనే పరాన్నజీవిని వదులుతుంది. దోమకాటు వల్ల ఏర్పడిన రంధ్రంలో నుంచి మనిషి రక్తంలోకి పరాన్నజీవి ప్రవేశించి విస్తరిస్తుంది. ఈ పరాన్నజీవి రక్తంలోని రోగనిరోధక వ్యవస్థగా ఉన్న ఎర్రరక్తకణాలపై దాడి చేస్తుంది. దీనిమూలంగా మనిషికి రోజువిడిచి రోజు జ్వరం సోకుతుంది. సరైన సమయంలో సరైన చికిత్స తీసుకొని పక్షంలో రోగనిరోధక వ్యవస్థ దెబ్బతిని రోగికి ప్రాణాంతకమవతుంది. సుమారు 20రకాల ఎనాఫిలిస్ దోమలు మలేరియా వ్యాప్తికి కారణమవుతున్నాయి. మలేరియా వ్యాధికి ప్రపంచంలో ప్లాస్మోడియం వైవాక్స్, ప్లాస్మోడియం ఫాల్సిపేరం, ప్లాస్మోడియం మలేరియా, ప్లాస్మాడియం ఓవేల్ అనే నాలుగు రకాల పరాన్నజీవులు వ్యాధి తీవ్రతకు కారణమవుతున్నాయి. మనదేశంలో ప్లాస్మోడియం వైవాక్స్, ప్లాస్మోడియం, ఫాల్సిపేరం అనే రెండు రకాల పరాన్నజీవులు కారణమవుతున్నాయి. వీటిలో ప్లాస్మోడియం ఫాల్సిపేరు అనే పరాన్నజీవి మలేరియా వ్యాధి తీవ్రతను పెంచి ప్రాణాంతకంగా మారుతోంది.

2007లో డబ్ల్యూహెచ్ఓ నిర్ణయం..

ఆఫ్రికా ఖండంలోని పలు దేశాల్లో మలేరియా కారణంగా 2006లో వేలాది మంది చిన్నారులు మృత్యువాతపడ్డారు. వ్యాధి తీవ్రతను గుర్తించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ 2007లో జరిగిన తమ నిర్ణయాల రూపకల్పన కమిటీ 'వరల్డ్ హెల్త్ అసెంబ్లీ' 60వ సమావేశాల్లో ఈ విషయంపై చర్చించి ప్రతి ఏటా ఏప్రిల్ 25న ప్రపంచ మలేరియా దినోత్సవం జరుపుకోవాలని నిర్ణయించింది. 2015లో జరిగిన ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలోని 'వరల్డ్ హెల్త్ అసెంబ్లీ' సమావేశాల్లో 2030 నాటికి మలేరియా కేసులు, మరణాలను ప్రపంచ వ్యాప్తంగా 90శాతం తగ్గించాలని లక్ష్యంగా నిర్ణయించింది.

2015 నుంచి మహబూబ్‌నగర్ జిల్లాలో నమోదైన మలేరియా కేసులు

ఏడాది	సేకరించిన రక్త నమూనాలు	నమోదైన కేసులు
2015	5,16,265	53
2016	5,14,178	52
2017	1,72,752	8
2018	1,88,187	5
2019	54,590	5
2020	1,00,194	7
2021	32,236	6
2022	4,45,261	2
2023	32,328	2


నిల్వ ఉన్న నీటిని పరిశీలిస్తున్న అధికారులు

> **నివారణ చర్యలు చేపడుతున్నాం..**
>
> జిల్లాలో మలేరియా నిర్మూలన కోసం మురికివాడలను, ఈ వ్యాధి వ్యాప్తిచెందే ప్రదేశాలను గుర్తించి 3,250 కుటుంబాలకు దోమ తెరలను పంపిణీ చేశాం. లార్వా నిర్మూలన కోసం నీటి కుంటల్లో గంబూసియా చేపలను వదలడం జరిగింది. ఇంటింటి సర్వే, రక్త నమూనాల సేకరణ, పాజిటివ్ కేసులకు చికిత్సలు అందించడం చేశాం. ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించడంతో పాటు ఇళ్లలో నీటిని నిల్వ పెట్టుకోకుండా చర్యలు తీసుకుంటున్నాం.
>
> – డాక్టర్ శ్వేత, జిల్లా మలేరియా అధికారి

నివారణ మార్గాలు..

మలేరియా వ్యాధి రాకుండా నివారించడానికి ఎటువంటి టీకా మందులు లేవు. కేవలం దోమ కాటు నుంచి రక్షించుకోవడమే ప్రధాన మార్గం. సంపులు, ఇతర నీటి పాత్రలు మురుగు నీటి నిల్వ ప్రదేశాలు వ్యాధికారక దోమలకు ప్రధాన కేంద్రాలుగా మారుతాయి. వీటిలో దోమలు ఆవాసాలు ఏర్పాటు చేసుకుని గుడ్లుపెట్టి సంతానోత్పత్తి చేస్తాయి. మురుగు నిల్వున్న ప్రదేశాల్లో కాలిన ఇంజిన్ ఆయిల్, కిరోసిన్, డీడీటీ పౌడర్‌ను పిచికారీ చేయాలి. 5మి.లీ. టెమిఫాస్ 50శాతం ఇసీ మందును 10లీటర్ల నీటిలో కలిపి మురుగు కాల్వలు, వర్షపు నీటి గుంతలు, బోర్లు, నల్లాల వద్ద ఏర్పడే నీటి గుంతలు, ఖాళీ చేయలేని నీటినిల్వ సంపులు, డ్రమ్ములలో పంచాయితీ సిబ్బంది పిచికారీ చేయాలి. ఈ ద్రావణం తినుబండారాలపై పడకుండా చర్యలు తీసుకోవాలి. కూలర్లు, పూలకుండీలు, నీటి డ్రమ్ములు, వాటర్ ట్యాంకుల్లో లార్వా పెరుగుతుంది. వీటిలో నీటిని మారుస్తూ ఉండాలి. సంపులపై ట్యాంకులపై మూతలు పెట్టాలి. వారానికి ఒకసారైన శుభ్రం చేయడం వల్ల లార్వా ఉంటే చనిపోతుంది. పాతటైర్లు, పాత్రలు, కొబ్బరి చిప్పలు వంటివి పరిసరాల్లో ఉండకుండా చూసుకోవాలి. కలుషిత నీటి ముప్పును ఎదుర్కొనేందుకు కాచి వడపోసిన నీటిని తాగటం చాలా అవసరం.

మలేరియా రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): దోమల కారణంగా మలేరియా రాకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని మహబూబ్‌నగర్ కలెక్టర్ రవినాయక్ అన్నారు. ఈనెల 25న ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఉద్దేశించి రూపొందించిన వాల్ పోస్టర్‌ను సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో ఆవిష్కరించారు. ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించి వాటిని తొలగించాలన్నారు. పనికి రాని పాత్రలు, టైర్లు, పగిలిపోయిన బకెట్లు తొట్ల వంటి వాటిలో నీరు నిల్వలేకుండా చూసుకోవాలని, వర్షం పడినప్పుడు నీళ్లు నిల్వ ఉంటే ప్రాంతాల్లో మోటర్లు ఏర్పాటు చేసి వాటిని తోడి వసేలా చూడాలన్నారు. ప్రతి శుక్రవారం వాటరింగ్ డే సందర్భంగా మొక్కలకు నీళ్లు పోయాలని అలాగే డ్రై డే నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సీతారామారావు, డీఎంహెచ్ఓ కృష్ణ, డాక్టర్ భాస్కర్, మిషన్ భగీరథ ఈఈ పుల్లారెడ్డి, డీఈఓ యాదయ్య, డీఆర్‌డీఏ ఏపీడీ జకియాసుల్తానా, మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుపై తెగిపడిన విద్యుత్ తీగలు


ఆర్టీసీ బస్సుపై తెగిపడిన విద్యుత్ తీగలు

- టిప్పర్ స్తంభాన్ని ఢీకొట్టడంతో ఘటన
- సరఫరా లేకపోవడంతో క్షేమంగా బయటపడిన 60కిపైగా ప్రయాణికులు

బిజినేపల్లి: మండల కేంద్రం నుంచి హైదరాబాద్‌కు 60 మందికిపైగా ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సుపై సోమవారం మధ్యాహ్నం విద్యుత్ తీగలు తెగిపడటంతో బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. లూర్దునగర్‌కాలనీ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జి వద్ద ఒండ్రుమట్టి తరలించే ఒక టిప్పర్ వట్టెం నుంచి బిజినేపల్లి వైపు వేగంగా వచ్చి రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో విద్యుత్ స్తంభం ఒక్కసారిగా కిందపడగా.. అదే సమయంలో బిజినేపల్లి నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సుపై తీగలు పడ్డాయి. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు ఒక్కసారిగి ఉలిక్కిపడి పెద్దఎత్తున కేకలు పెట్టారు. వెంటనే బస్సును ఆపేయడంతో ప్రయాణికులు కిందకి దిగారు. అయితే అంతకు ముందే సాంకేతిక కారణాలతో విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. ఆ తర్వాత విద్యుత్ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ ప్రమాదంతో ఆ రోడ్డుపై కొద్దిమేర ట్రాఫిక్ నిలిచిపోయింది.

అడ్డూ అదుపు లేని వేగం

వట్టెం జలాశయం నిర్మాణం పేరుతో ఒండ్రుమట్టిని తరలించే టిప్పర్లు అడ్డూ అదుపు లేకుండా అత్యంత వేగంతో బిజినేపల్లి మండల కేంద్రంలో ప్రయాణిస్తున్నాయి. ఏదైనా ప్రమాదం జరిగితే వాహనం నోట్ చేసుకోవడానికి నంబర్ ప్లేట్లు సైతం లేవు. ఈ విషయం ఆర్టీఓ అధికారులు బహిరంగంగానే గమనించినా.. ఒక్కరోజు కూడా వాటిపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

తూనికలు-కొలతల అధికారుల తనిఖీలు

- ముగ్గురుకి జరిమానా


జిల్లా కేంద్రంలోని యూకో బ్యాంకులో ఎలక్ట్రానిక్ కాంటాను పరిశీలిస్తున్న అధికారులు

వనపర్తి: జిల్లా తూనికలు-కొలతల అధికారి బృందం సోమవారం పలు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. నిబంధనలు పాటించని ముగ్గురికి జరిమానాలు విధించారు. ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు వస్తువులను విక్రయించటం, స్టాంపింగ్ లేకుండా తూకం బాట్లను ఉపయోగించి వస్తువులను తూకం వేయడం చేస్తే చర్యలు తప్పని జిల్లా అధికారి సత్యనారాయణ స్పష్టం చేశారు. ఇప్పటికే అందిన ఫిర్యాదుల మేరకు జిల్లా కేంద్రంలోని యూకో బ్యాంకులో గల ఎలక్ట్రానిక్ కాంటా గడువు తీరినా.. రెన్యూవల్ చేయించకపోవటాన్ని గుర్తించి రూ.10వేల జరిమానా విధించారు. అనంతరం మరికుంట ప్రాంతంలోని ఓ చాయ్ హోటల్‌లో వాటర్ బాటిల్ అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు గుర్తించి హోటల్ యజమానికి రూ.5వేల జరిమానా విధించారు. కొత్తకోట మండలంలోని అమడబాకులలో చేపలు విక్రయించే మత్స్యకారుడు ఉపయోగిస్తున్న కాంటా బాట్లకు ముద్రలు వేయించకుండానే తూకం చేయటాన్ని గుర్తించి అతనికి రూ.4వేల జరిమానా వేశారు. వ్యాపారస్తులు కచ్చితంగా ముద్రలు వేసిన ఎలక్ట్రానిక్ కాంటాలు, బాట్లు ఉపయోగించాలని ఆదేశించారు. దాడులు నిర్వహించిన బృందంలో టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మేనమామపై అల్లుడు దాడి

- కత్తితో పలుమార్లు నరికిన వైనం

శాంతినగర్: వడ్డీ డబ్బుల విషయంలో తేడాలు రావడంతో సొంత మేనమామపై మేనల్లుడు కత్తితో దాడి చేసిన సంఘటన వడ్డేపల్లి మండలంలోని జిల్లెడుదిన్నెలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. బాధితుడి తమ్ముడు వడ్డె నర్సింహులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా.. జిల్లెడుదిన్నెకు చెందిన వడ్డె పూలస్వామి వృత్తి రీత్యా వ్యవసాయంతో పాటు వ్యాపారం చేస్తుండేవాడు. వ్యాపారం కోసం ఎద్దులగూడెంకు చెందిన అక్క కొడుకు వడ్డె ఆంజనేయులుతో ఆర్థిక లావాదేవీలు నడిపేవాడు. డబ్బుల విషయంలో తేడాలు రావడంతో కొంతకాలంగా ఇరు కుటుంబాల వారు గొడవలు పడుతున్నారు. ఆదివారం రాత్రి జిల్లెడుదిన్నె నుంచి శాంతినగర్‌కు బైక్‌పై ఒంటరిగా వెళ్తున్న పూలస్వామిని కాపుకాచి ఆంజనేయులు వెంబడించాడు. తన వెంట తెచ్చుకున్న కత్తితో పూలస్వామి ముఖంపై పలుమార్లు కత్తితో పొడిచి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం హుటాహుటిన కర్నూలులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రాణాపాయ స్థితిలో పూలస్వామి కొట్టుమిట్టాడుతున్నాడని కుటుంబసభ్యులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

ప్రేమకు అడ్డువస్తున్నాడని.. వ్యక్తి దారుణ హత్య


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ కె.నరసింహ

రాజాపూర్: తమ ప్రేమకు అడ్డు వస్తుండటంతో పాటు తన ప్రియురాలిని దక్కకుండా చేస్తున్నాడని ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేశాడు. మండలంలోని తిర్మలాపూర్‌లో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. వికారాబాద్ జిల్లా దోమ మండలం చెన్నారెడ్డిపల్లికి చెందిన రాములు తిర్మలాపూర్‌లో పోలేపల్లి యాదయ్య అనే వ్యక్తి వద్ద గత రెండేళ్లుగా పనిచేస్తున్నాడు. అయితే రాములు చిన్న కూతురు, నవాబుపేట మండలం కన్మన్‌కల్వకు చెందిన కేశవులు ప్రేమించుకుని మూడేళ్లుగా సహజీవనం చేశారు. ఈ క్రమంలో కొన్నిరోజుల క్రితం రాములు కూతురును కొన్ని రోజుల క్రితం తమ ఇంటికి తీసుకువచ్చి దోమ పోలీస్‌స్టేషన్‌లో కేశవులుపై ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. తమ అమ్మాయికి వేరే వ్యక్తి తో వివాహం చేస్తున్నామని యువతి తండ్రి రాములు, అల్లుడు (యువతి బావ) నర్సింహులు చెప్పారు. దీంతో కక్ష పెంచుకున్న కేశవులు సోమవారం రాత్రి తిర్మలాపూర్‌కు వచ్చి నర్సింహులు(36)పై కత్తితో దాడి చేయడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. అలాగే నర్సింహులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం హత్య జరిగిన ప్రదేశాన్ని ఎస్పీ కె.నరసింహ పరిశీలించారు. నిందితుడికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎస్పీ డీఎస్పీ, రూరల్ సీఐ ఉన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

పెంట్లవెల్లి: మండల కేంద్రానికి చెందిన మల్లయ్య, మణెమ్మ దంపతులు అదే గ్రామానికి చెందిన కృష్ణయ్య మధ్య కొన్ని రోజులుగా భూ గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం రాత్రి ఇరువురు పొలం పనులు చేస్తుండగా, దాడులు చేసుకున్నారు. సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామేశ్వర్‌రెడ్డి తెలిపారు.

పాలమూరు కలెక్టరేట్ గార్డెన్‌కు గోల్డెన్ అవార్డు



ట్రోఫీని అందజేస్తున్న కలెక్టర్ రవినాయక్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఈ నెల 15న హైదరాబాద్‌లో నిర్వహించిన 7వ గార్డెన్ ఫెస్టివల్‌లో జిల్లా సమీకృత భవన సముదాయంలోని గార్డెన్ గోల్డెన్ అవార్డును గెలుపొందించి. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి ఉద్యాన శాఖాధికారి సాయిబాబ, ఆర్‌అండ్‌బీ ఈఈ సామిలకు 15న ట్రోఫీ అందజేయగా సోమవారం ఆ ట్రోఫీని తిరిగి కలెక్టర్ రవినాయక్ చేతులమీదుగా వీరు అందుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గార్డెన్‌ను ఇది వరకు పరిరక్షించినట్లుగానే ఎల్లప్పుడు చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. అవార్డు వచ్చేందుకు కృషిచేసిన ఉద్యానవన అధికారి, ఆర్‌అండ్‌బీ ఈఈలను కలెక్టర్ అభినందించారు. ముఖ్యంగా గార్డెన్ సంరక్షణలో సరైన చర్యలు తీసుకోవడంతోపాటు సూచనలు, సలహాలు అందించిన అదనపు కలెక్టర్ సీతారామారావును శాలువాతో సన్మానించారు.

ఐదుగురిపై కేసు నమోదు

వనపర్తి క్రైం: అదనపు కట్నం కోసం భర్త, అత్తామామలు వేధిస్తున్నారని బాధితురాలు సోమవారం వనపర్తి పట్టణ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించింది. పట్టణ ఎస్‌ఐ యుగేంధర్‌రెడ్డి కథనం ప్రకారం.. జిల్లాకేంద్రానికి చెందిన సింధు, నాగరాజుకు 2015లో వివాహం జరిగింది. పెళ్లైన ఏడాదికి పాప పుట్టింది. భర్త వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో పాటు అదనంగా కట్నం తీసుకురావాలని భర్తతోపాటు అత్త, మామ, ఆడపడుచు, మరిది వేధింపులకు గురిచేస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కొడుకు పెళ్లి కోసం వచ్చి తండ్రి మృతి

ఉప్పునుంతల: ఇరువై ఏళ్ల నుంచి హైదరాబాద్‌లో ఉంటూ కొడుకు పెళ్లి చేయడానికి సొంత గ్రామానికి వచ్చి తండ్రి ఆకస్మికంగా చనిపోయిన సంఘటన మండలంలోని పెనిమిళ్లలో సోమవారం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కేతావత్ మల్లేష్(40) కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌లో ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య శారదతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కొడుకు పెళ్లి సంబంధం కుదరడంతో గ్రామంలోనే పెళ్లి చేయాలని నిశ్చయించి రెండు రోజుల కిందట నిశ్చితార్థం చేసుకున్నారు. సోమవారం ఉదయం ఇంటిని శుభ్రం చేస్తుండగా, మల్లేష్ ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు ఆటోలో వెల్దండ సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే చనిపోయినట్లు తెలిపారు.

రాములోరి తలంబ్రాలకు విశేష స్పందన

- ఆర్టీసీ రీజియన్ వ్యాప్తంగా 15,263 బుకింగ్స్
- రాష్ట్రంలోనే మహబూబ్‌నగర్ రెండోస్థానం


తలంబ్రాల కోసం పేరు నమోదు చేసుకుంటున్న ఆర్ఎం శ్రీదేవి

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ సంస్థ కార్గో, పార్సిల్ సేవలతో ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఆర్టీసీ కార్గో సేవల పట్ల ప్రజల్లో మంచి స్పందన లభిస్తోంది. సమ్మక్క, సారక్క జాతరను పురస్కరించుకొని భక్తులకు మేడారాం ప్రసాదాన్ని అందించగా శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకొని ఇంటివద్దకే భద్రాద్రి రాములోరి తలంబ్రాల కార్యక్రమాన్ని చేపట్టింది. కాగా.. గతేడాది రాములోరి తలంబ్రాలు 15,305 బుకింగ్స్‌తో మహబూబ్‌నగర్ రీజియన్ అగ్రస్థానంలో నిలిచింది. ఈ ఏడాది తలంబ్రాలు 15,263 బుకింగ్స్‌తో తెలంగాణలో రీజియన్ రెండోస్థానంలో నిలవడం విశేషం.

'లోక కల్యాణం...పచ్చ తోరణం' పేరిట ప్రసిద్ధిగాంచిన భద్రాచలంలో జరిగిన శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా శ్రీసీతారాముల కల్యాణ తలంబ్రాలు ఆర్టీసీ కార్గో ద్వారా అందించడానికి ఏర్పాట్లు చేసింది. రూ.116లు చెల్లించి ఆర్టీసీ కార్గో పార్సిల్ సేవా కేంద్రాల్లో బుకింగ్ చేసుకున్న వారికి ఇంటివద్దకే కల్యాణ తలంబ్రాలు అందిస్తామని ప్రకటించింది. దీంతో ఈనెల 10వ తేదీ వరకు తలంబ్రాలు బుకింగ్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. మహబూబ్‌నగర్ రీజియన్ వ్యాప్తంగా తలంబ్రాలు కోసం 15,263 మంది బుకింగ్ చేసుకోగా రూ.17,70,508 ఆదాయం వచ్చింది.

డిపోల వారీగా తలంబ్రాలు బుకింగ్ వివరాలు..

డిపో	తలంబ్రాలు బుకింగ్	ఆదాయం (రూ.లలో)
మహబూబ్‌నగర్	4,916	5,70,256
షాద్‌నగర్	2,030	2,35,480
కల్వకుర్తి	2,018	2,34,088
వనపర్తి	1485	1,72,260
నాగర్‌కర్నూల్	1,205	1,39,780
అచ్చంపేట	1,168	1,35,488
కొల్లాపూర్	1,040	1,20,640
గద్వాల	980	1,13,980
నారాయణపేట	421	48,836

> **మెరుగైన సేవలు**
>
> 
>
> రాములోరి తలంబ్రాలుకు భక్తుల నుంచి విశేష స్పందన లభించింది. గత ఏడాది కూడా అధికసంఖ్యలో బుకింగ్స్ చేశారు. ఈ ఏడాది తెలంగాణలో మహబూబ్‌నగర్ రీజియన్ రెండోస్థానంలో నిలిచినందుకు సంతోషంగా ఉంది. ఏటీఎం, ఆర్టీసీ ఆర్ఎం, డిపో మేనేజర్లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌ల సహకారంతో ఈ ఘనతను సాధించాం. భవిష్యత్‌లో ఆర్టీసీ కార్గో పరంగా ప్రజలకు ఇంకా మెరుగైన సేవలు అందిస్తాం. – శివకృష్ణ, ఆర్టీసీ కార్గో రీజియన్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్

క్లుప్తంగా...

వివేకా కేసు దర్యాప్తు గడువు పొడిగింపు

సాక్షి, న్యూఢిల్లీ: మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసులో దర్యాప్తు కాల పరిమితిని సుప్రీంకోర్టు పొడిగించింది. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ నెల 30వతేదీతో గడువు ముగియనుండగా తాజాగా జూన్ 30 వరకు పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈమేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యా యమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు వెలువరించింది. మరోవైపు ఈ కేసులో ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి ముందస్తు బెయిల్‌కి సంబంధించి తెలంగాణ హై కోర్టు ఇచ్చిన ఆదేశాలను కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది. ఈమేరకు వివేకా కుమార్తె సునీత దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు ముగించింది. సునీత తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూత్రా, అవినాశ్‌రెడ్డి తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. ఎంపీ అవినాశ్‌రెడ్డి ముందస్తు బెయిల్ గురించి ఈ సమయంలో అడగాల్సిన అవసరం లేదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. కాగా మంగళవారం తెలంగాణ హైకోర్టు ముందుకు రానున్న పిటిషన్‌లో ముందస్తు బెయిల్‌కు సంబంధించి అవినాశ్ రెడ్డి తన వాదనలు వినిపించుకోవచ్చని ధర్మాసనం చెప్పింది.

మంజీరా కుంభమేళా ప్రారంభం

న్యాల్‌కల్(జహీరాబాద్): సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండల పరిధిలోని రాఘవాపూర్–హుమ్నాపూర్ గ్రామాల శివారులోని పంచవటి క్షేత్రంలో మంజీర (గరుడగంగ) కుంభమేళా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. క్షేత్రంలోని ఆలయాల్లో సోమవారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ధ్వజారోహణం, గంగా స్నానాలు, బోనాల ఊరేగింపు, గంగపూజ, హోమం, పూర్ణాహుతి, అమృత స్నానాల కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్, జహీరాబాద్, నారాయణఖేడ్ ఎమ్మెల్యేలు మాణిక్‌రావు, భూపాల్‌రెడ్డి ఉత్సవాలకు హాజరయ్యారు.

నేటి నుంచి రామానుజుల జయంతి వేడుకలు

శంషాబాద్ రూరల్: భగవద్రామానుజుల 1006వ జయంతి సందర్భంగా మంగళవారం నుంచి ముచ్చింతల్ సమీపంలోని శ్రీరామనగరం సమతా స్ఫూర్తి కేంద్రంలో వేడుకలు నిర్వహించనున్నారు. మే 1 వరకు జరిగే ఈ వేడుకల్లో రోజూ తిరుమంజన సేవ, తిరువీధి సేవలతో పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.


ఔరంగాబాద్ సభకు హాజరైన జనం

నదులున్నా తాగునీరేదీ?

▶ మొదటి పేజీ తరువాయి
దేశం ముందుకెళ్లదు. అనివార్యమైన మార్పును తీసుకురావడం కోసమే బీఆర్‌ఎస్ పుట్టింది. ఒక కులం, మతం, వర్గం కోసం ఆవిర్భవించలేదు. బీఆర్‌ఎస్‌కు ఒక లక్ష్యం ఉంది. మార్పు వచ్చే వరకు పార్టీ పోరాటం ఆగదు. నిజాయితీగా మేం చేసే పోరాటానికి విజయం తథ్యం. మహారాష్ట్రలో బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తే ప్రతి ఇంటికీ నీరు ఇస్తాం. కొత్త పార్టీ అనగానే కొందరు అపవాదులు సృష్టిస్తారు. ఎన్ని అవాంతరాలు సృష్టించినా వెనకడుగు వేసే ప్రసక్తే లేదు..' అని కేసీఆర్ స్పష్టం చేశారు.

అబద్ధమైతే సీఎం పదవిలో నిమిషం కూడా ఉండను

'వాస్తవానికి దేశంలో సమృద్ధిగా నీటి వనరులున్నాయి. వీటిని సాగు యోగ్యత ఉన్న భూములకు అందించాల్సి ఉంది. 24 గంటలు విద్యుత్ సరఫరా చేయగల వనరులు ఉన్నాయి. దేశం మొత్తం వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఇవ్వొచ్చు. నేను చెప్పేది అబద్ధమైతే ఒక్క నిమిషం కూడా సీఎం పదవిలో ఉండను. తెలంగాణలో మంచినీటి సమస్య లేకుండా చేశాం. తెలంగాణ రాకముందు రోజుకు 3 గంటలే కరెంటు ఉండేది. ఒక్కోసారి అది కూడా ఉండేది కాదు. ప్రస్తుతం తెలంగాణలో వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన కరెంటు ఇస్తున్నాం. భూముల రిజిస్ట్రేషన్లు పావుగంటలో అవుతున్నాయి. రైతు చనిపోతే బీమా కల్పిస్తున్నాం. ఇవి మహారాష్ట్రలో ఎందుకు అమలు కావడం లేదు? తెలంగాణలో సాధ్యమైనప్పుడు మహారాష్ట్రలో ఎందుకు సాధ్యం కాదు? ఎందుకంటే ప్రధాని, రాష్ట్రాల సీఎంలకు ఆ పనిచేసే సామర్థ్యాలు లేవు..' అని కేసీఆర్ విమర్శించారు.

కొత్త సంకల్పంతో ముందుకు సాగాలి

'నా మాటలు ఇక్కడ విని ఇక్కడే మరిచిపోకండి. గ్రామాలకు వెళ్లి చర్చ చేయండి. మీ ఇంటివాళ్లు, స్నేహితులు, వీధిలో ఉన్న వారితో చర్చించండి. దేశంలో ఉండాల్సిన స్థితిలో ఉందా? లేదా? అనే విషయంపై చర్చ పెట్టాలి. లక్ష్యం లేని ప్రయాణం ఎక్కడికి వెళుతుంది? దేశం కొత్త లక్ష్యాలు, కొత్త సంకల్పంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు అయ్యింది. అయినా ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. శంభాజీనగర్‌లో వారానికోసారి నీళ్లు వస్తాయా? మహారాష్ట్రలో కేబినెట్ ఉంటుంది. చీఫ్ సెక్రటరీ ఉండరా?..' అని ప్రశ్నించారు.


ఔరంగాబాద్ సభలో సీఎం కేసీఆర్

తెలంగాణ మోడల్ అమలు చేస్తే ఎందుకు వస్తా?

'కేసీఆర్‌కు మహారాష్ట్రలో ఏం పని అని ఫడ్నవీస్ అంటున్నారు. తెలంగాణ లాంటి మోడల్ మహారాష్ట్రలో తీసుకొస్తే నేనెందుకు వస్తాను? మహారాష్ట్రలో దళితబంధు, రైతుబంధు అమలు చెయ్.. 24 గంటల కరెంటు ఇవ్వు. రైతుబంధు, రైతుబీమా కల్పించండి. ఇవన్నీ అమలు చేస్తే మహారాష్ట్రకు రానే రాను. అంబేడ్కర్ జన్మించిన నేలపై దళితులను పట్టించుకోరా? దళితబంధు లాంటి పథకం మహారాష్ట్రలో ఎందుకు అమలు చేయరు?..' అని నిలదీశారు.

ప్రజల ఆకాంక్ష గెలవాలి

'దేశంలో పరివర్తన రావాల్సిన అవసరం ఉంది. ఒక పార్టీ గెలిస్తే.. మరో పార్టీ ఓడిపోవడం పరివర్తన కాదు. ఎవరు గెలిచినా సమస్య అపరిష్కృతంగానే ఉంటోంది. అందువల్ల పార్టీలు గెలవడం ముఖ్యం కాదు.. ప్రజల ఆకాంక్ష గెలవడం ముఖ్యం. పరివర్తన రానంత కాలం ఈ దేశం ఇలాగే కునారిల్లుతుంది. ఎంత త్వరగా మేల్కొంటే.. అంత త్వరగా బాగుపడతాం..' అని కేసీఆర్ అన్నారు. నూతనంగా నిర్మించే పార్లమెంటుకు అంబేడ్కర్ పేరు పెట్టాలని డిమాండ్ చేశారు.

అభయ్ పాటిల్ ఇంటికి కేసీఆర్

హైదరాబాద్ నుంచి ఔరంగాబాద్ సభకు వెళ్లిన కేసీఆర్, విమానాశ్రయం నుంచి నేరుగా వైజాపూర్ మాజీ ఎమ్మెల్యే అభయ్ పాటిల్ ఇంటికి చేరుకున్నారు. ఆయనకు అక్కడ అపూర్వ స్వాగతం లభించింది. మహారాష్ట్రలో బీఆర్‌ఎస్ పార్టీ ఆఫీసు ఏర్పాటు చేస్తామని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. కేసీఆర్ వెంట పార్టీ ఎంపీలు కేశవరావు, రంజిత్ రెడ్డి, సంతోష్ కుమార్, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, దేశపతి శ్రీనివాస్, కడియం శ్రీహరి, ఎమ్మెల్యే బాల్క సుమన్ ఉన్నారు.

కార్యోన్ముఖులుగా కార్యకర్తలు
నేడు బీఆర్‌ఎస్ ప్రతినిధుల సభలు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికలకు పార్టీ యంత్రాంగాన్ని సన్నద్ధం చేయడంలో భాగంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ప్రతినిధుల సభలు నిర్వహించేందుకు బీఆర్‌ఎస్ పార్టీ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ నెల 27న బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం నేపథ్యంలో మంగళవారం నియోజకవర్గ కేంద్రాల్లో జరిగే ప్రతినిధుల సభల్లో సుమారు 3 వేల నుంచి 3,500 మంది కార్యకర్తలు పాల్గొనే అవకాశం ఉంది. రాష్ట్రమంతా కలుపుకుని క్షేత్ర స్థాయిలో క్రియాశీలంగా పనిచేస్తున్న సుమారు నాలుగు లక్షల మంది కార్యకర్తలు, నేతలు ఈ సభల్లో భాగస్వాములు కానున్నారు. ఈ సభల్లో ఆరు తీర్మానాలు చేయాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇప్పటికే దిశా నిర్దేశం చేశారు. సాగు, సంక్షేమం, పల్లె ప్రగతి– పట్టణ ప్రగతి, విద్య ఉపాధి, బీజేపీ వైఫల్యాలు, స్థానిక అంశాలపై ప్రతినిధులు తీర్మానాలు చేయనున్నారు.

నేటి నుంచి ఆర్టి‘జనుల’ సమ్మె

- పిలుపునిచ్చిన ఆర్టిజన్ల ప్రాతినిధ్య సంఘాలు
- సమ్మెతో తమకు సంబంధం లేదన్న ప్రధాన ఉద్యోగ సంఘాలు
- ఎస్మా ప్రయోగిస్తామని యాజమాన్యాల హెచ్చరిక
- విద్యుత్ సంస్థల్లో తీవ్ర ఉత్కంఠ పరిస్థితులు

సాక్షి, హైదరాబాద్: తమ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర విద్యుత్ సంస్థల్లోని 'ఆర్టిజన్లు' మంగళవారం ఉదయం 8 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతారని ఉద్యోగ సంఘాలు ప్రకటించాయి. 23 వేల మంది కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను గతంలో విద్యుత్ సంస్థలు ఆర్టిజన్ల పేరుతో విలీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆర్టిజన్ల సమస్యల పరిష్కారానికి దీర్ఘకాలంగా పోరాడుతున్నా ఫలితం లేకపోవడంతో ఈనెల 25 నుంచి సమ్మెబాటపట్టాలని.. తెలంగాణ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ (హెచ్82), ఇత్తెహాద్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్‌లు పిలుపునిచ్చాయి. కాగా, విద్యుత్ సంస్థల్లో సమ్మెలపై నిషేధం అమల్లో ఉందని, ఎవరైనా సమ్మెకు దిగినా, విధులకు గైర్హాజరైనా అత్యవసర సేవల నిర్వహణ చట్టం (ఎస్మా) ప్రయోగించి ఉద్యోగం నుంచి తొలగించాలని అధికారులకు విద్యుత్ సంస్థల యాజమాన్యాలు ఆదేశాలు జారీచేశాయి. దీంతో సమ్మెపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

స్టాండింగ్ ఆర్డర్స్ రద్దు చేయాలి..

రెగ్యులర్ విద్యుత్ ఉద్యోగులకు ఏపీ ఎలక్ట్రిసిటీ బోర్డు సర్వీస్ రూల్స్‌ను, ఆర్టిజన్ల కోసం 'స్టాండింగ్ ఆర్డర్స్' పేరుతో ప్రత్యేక సర్వీస్ రూల్స్‌ను అమలు చేస్తున్నారు. అయితే, తమకూ ఎలక్ట్రిసిటీ బోర్డు సర్వీస్ రూల్స్‌ను వర్తింపజేయాలని ఆర్టిజన్లు డిమాండ్ చేస్తున్నారు. అలాగే, 7% ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ అమలు, ఇతర సమస్యల పరిష్కారానికి ఈ నెల 15న విద్యుత్ ఉద్యోగ సంఘాల ఉభయ జేఏసీలతో సంస్థల యాజమాన్యాలు వేతన సవరణ ఒ ప్పందం కుదుర్చుకోగా, దీన్ని 'ఆర్టిజన్ల' సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. విద్యార్హతలు, నైపుణ్యం ఆధారంగా ఆర్టిజన్లను రెగ్యులర్ పోస్టులకు తీసుకుని పదోన్నతి కల్పించాలని, 50% ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ అమలు చేయాలని, కనీసం రూ.25 వేలకు తగ్గకుండా మాస్టర్ స్కేల్‌ను ఖరారు చేయాలని ఈ సంఘాలు సమ్మె నోటీసుల్లో కోరాయి.

నిరంతర విద్యుత్ సరఫరాపై ప్రభావం !

నిరంతర విద్యుత్ సరఫరా కొనసాగింపులో ఆర్టిజన్ల సేవలు కీలకం. ఎక్కడ చిన్న అంతరాయం కలిగినా రంగంలో దిగి విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తారు. మరమ్మతులు, నిర్వహణ విభాగాల్లో వీరి సంఖ్యే అధికం. దీంతో ఆర్టిజన్లు పాక్షికంగా సమ్మెకి దిగి నా నిరంతర విద్యుత్ సరఫరాపై ప్రతికూల ప్రభావం పడుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

సమ్మెలో పాల్గొంటే కఠిన చర్యలు

విద్యుత్ సంస్థల్లో ఎస్మా కింద సమ్మెలపై నిషేధం అమల్లో ఉన్నందున ఆర్టిజన్లు పిలుపునిచ్చిన సమ్మె పూర్తిగా చట్టవిరుద్ధమని ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు స్పష్టం చేశారు. సమ్మెకు దిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏప్రిల్ 15న అన్ని ఉద్యోగ సంఘాలతో పాటే ఆర్టిజన్లకు కూడా సహేతుకమైన వేతన సవరణ చేశామన్నారు. కాగా, ఆర్టిజన్ల సమ్మెతో తమకు సంబంధం లేదని తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ, టీఈఈ 1104 యూనియన్, టీఎస్‌పీఈయూ–1535, బీఆర్‌వీకేఎస్, టీఎస్‌ఈఈయూ–327 యూనియన్లు ప్రకటించాయి.

యువతి గొంతు కోసిన ప్రేమోన్మాది

అడ్డుకున్న స్థానికులు.. ఆస్పత్రిలో చేరిక

అమీర్‌పేట/రహమత్‌నగర్: యువతిపై కత్తితో దాడి చేసాడో ప్రేమోన్మాది. తనను కాదని వేరే వ్యక్తిని పెళ్లి చేసుకుంటోందని కక్షగట్టి గొంతు కోసాడు. ఎస్‌ఆర్‌నగర్ పోలీసుల కథనం మేరకు బోరబండ బంజారానగర్‌లో సోమవారం చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలిలా.. మహబూబ్‌నగర్ జిల్లా తుర్కపల్లికి చెందిన సిద్దప్ప కుమార్తె లక్ష్మి గత కొంత కాలం క్రితం నగరానికి వచ్చి బోరబండ సైట్–1లో ఉంటోంది. స్థానిక స్వరాజ్‌నగర్‌కు చెందిన కిషోర్‌తో పరిచయమైంది. అతను మోతీనగర్‌లో ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నడుపగా లక్ష్మి చాలా కాలం అక్కడే పనిచేసింది. ఇద్దరి మధ్య మనస్పర్ధలు రావడంతో అక్కడ పని మానివేసింది. కిషోర్ కూడా ఫాస్ట్ ఫుడ్ సెంటర్ ఎత్తివేశాడు. ఆ తర్వాత అతను పలు మార్లు మాట్లాడేందుకు ప్రయత్నించినా నిరాకరించింది. కాగా, ఇటీవల వేరే వ్యక్తితో లక్ష్మికి నిశ్చితార్థం జరిగినట్లు కిషోర్‌కు తెలిసింది. వేరే వ్యక్తిని పెళ్లి చేసుకోవడాన్ని కిషోర్ జీర్ణించుకోలేక ఎలాగైనా ఆమెను మట్టు పెట్టాలనే నిర్ణయానికి వచ్చాడు. ఈ క్రమంలో హౌస్ కీపింగ్ పని చేస్తున్న లక్ష్మి సోమవారం పని ముగించుకుని సాయంత్రం 4.30 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతుండగా బంజారానగర్‌లో ఆమెను అడ్డగించాడు. కళ్లల్లో కారం చల్లి ఫాస్టు ఫుడ్ సెంటర్‌లో ఉల్లి గడ్డలు కోసే కత్తితో గొంతు కోశాడు. స్థానికులు వారించగా కత్తి చూపి బెదిరించాడు. అందరూ చూస్తుండగానే గొంతుపై రెండు, చేతులపై రెండు పోట్లు పొడిచాడు. అంతలోనే స్థానికులు పట్టుకున్నారు. తీవ్ర గాయాలైన యువతిని ప్రయివేటు ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఆమె తలకు హెల్మెట్ ఉండటంతో తలపై తీవ్రగాయాలు కాకుండా తప్పించుకోగలిగినప్పటికీ ప్రస్తుత పరిస్థితి ఒకింత ఆందోళనకరంగానే ఉందని పోలీసులు తెలిపారు.


నిందితుడు కిషోర్

‘దరఖాస్తు చేసుకోండి’

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్ ప్రవేశ పరీక్ష రాయడానికి ఉమ్మడి జిల్లాలోని అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని డైట్ ప్రిన్సిపాల్ డా.మొహ్మద్ మేరజుల్లాఖాన్ ఒక ప్రకటనలో కోరారు. తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మీడియంలోని అర్హత కలిగిన వారు డీఈఈసీఈటీ–2023 ద్వారా రెండేళ్ల పాటు విద్యనభ్యసించేందుకు గాను ప్రవేశ ప్రక్రియ చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ ఏడాది సెప్టెంబర్ 1 నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలని, కంప్యూటర్ బేస్డ్ ఆన్‌లైన్ మోడ్ ఈ పరీక్ష ఉంటుందని, పూర్తి వివరాలు http:/deecet.cdre.telangana.gov.inలో చూడవచ్చని తెలిపారు. వచ్చే నెల 22వ తేదీలోగా పూర్తిచేసిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లోనే సమర్పించాలని సూచించారు.

రాష్ట్ర బృందం పరిశీలన



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రాన్ని న్యాక్‌లోకి తీసుకోవాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఈ మేరకు రాష్ట్ర బృందం మహబూబ్‌నగర్‌లోని రీజినల్ సెంటర్‌ను సోమవారం పరిశీలించింది. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ న్యాక్ ఇన్‌చార్జ్ అసోసియేట్ డా.వై.వెంకటేశ్వర్లు, ఎంవీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి, రీజినల్ కో–ఆర్డినేటర్ డా.విజయ కుమార్‌తో కలిసి చర్చించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ఆయా అధ్యయన కేంద్రాల్లో డిగ్రీ పూర్తి చేసి వివిధ ఉద్యోగ, వ్యాపార రంగాల్లో స్థిరపడిన విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి అన్ని అధ్యయన కేంద్రాల కో–ఆర్డినేటర్లు, సిబ్బంది సహకరించాలన్నారు. ఈ బృందంలో అలమ్ని రాష్ట్ర నోడల్ అధికారి డా.బి.ధర్మానాయక్ ఉండగా, కౌన్సిలర్లు రాఘవేందర్‌రెడ్డి, నాగరాజాచారి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి రిమాండ్

ఉండవెల్లి: ఉద్యోగాలు ఇప్పిస్తానని నిరుద్యోగులను మోసం చేసిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ బాల్‌రాజు తెలిపారు. తక్కశీల గ్రామానికి చెందిన రాంమోహన్ అనే వ్యక్తిని ఆదివారం రాత్రి పట్టుకున్నామని, సోమవారం అలంపూర్ కోర్టులో హాజరు పరచగా రిమాండ్‌కు ఆదేశించారని తెలిపారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారని చెప్పారు. కాగా ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగులకు వల వేసిన విషయమై ఈనెల 5వ తేదీన కేసు నమోదు చేసిన విషయం పాఠకులకు విదితమే.

పాములతో జాగ్రత్త

- మండే ఎండలు, అకాల వర్షాలకు రంధ్రాల్లోకి నీరు
- బయటకు వస్తున్న పాములు
- ఈనెలలోనే 25పాములు పట్టుకున్న సదాశివయ్య బృందం



జడ్చర్ల టౌన్: పాములతో తస్మాత్ జాగ్రత్త. ఎండలు మండుతుంటే పాములతో జాగ్రత్త అంటారేంటి అనుకుంటున్నారా? ఎండలు మండుతున్నప్పటికీ అడపా దడపా కురుస్తున్న వర్షాలకు వర్షపునీరు రంధ్రాల్లోకి వెళ్లటంతో వాటిల్లో ఉన్న పాములు బయటకు వస్తున్నందును జాగ్రత్త అంటున్నారు నిపుణులు. ఏప్రిల్ నెలలోనే పట్టణం, పరిసర ప్రాంతాల్లో డిగ్రీ కళాశాల సర్పరక్షకుడు డా.సదాశివయ్య, శిష్య బృందం 25 పాములు పట్టుకున్నారంటే వాటి తీవ్రత అర్థమవుతుంది. సాధారణంగా ఎండాకాలంలో ఎండలు మండుతుండటంతో పాములు వాటి స్థావరాలైన పుట్టలు, ఇతర రంధ్రాల్లో సేదతీరుతుంటాయి. పాములు శీతల రక్త జంతువులు. చల్లటి ప్రాంతాల్లోనే ఎక్కువగా ఉంటాయి. పుట్టలు, రంధ్రాల్లో వేడి తక్కువగా ఉండటం వల్ల అక్కడే ఉంటాయి. ఈ సమయంలో అకాల వర్షాలకు వర్షపునీరు రంధ్రాల్లోకి, పుట్టల్లోకి చేరుతుంటాయి. దీంతో ఆ రంధ్రాలు, పుట్టల్లో వేడి పుట్టుకువస్తుంది. వేడిని తాళలేక పాములు బయటకు వస్తాయి. బయటకు వచ్చిన పాములు సమీపంలో నీటి నిల్వ ఉండే ప్రాంతాలు, పచ్చటి చెట్లు, పంటపొలాలు, చెత్తాచెదారం నిండి ఉన్న చోటుకు వస్తుంటాయి. అవి రాత్రివేళల్లో ఎక్కువగా సంచరిస్తుంటాయి.

కట్లపాముతో డేంజర్

ఆరు బయట పడుకున్న వారిని నాగుపాము, జెర్రిపోతు వంటివి కాటేస్తే వెంటనే బాధ కలిగి లేచి చూసుకుంటారు. పాము కరిచిందని గుర్తించి చికిత్స తీసుకునే అవకాశం ఉంది. అయితే కట్ల పాము కరిస్తే 3గంటల వరకు ఎలాంటి బాధ కలగదు. దీంతో కరిచిన ఆనవాళ్లు లేకపోవటంతో శరీరంలోకి విషం అంతా పాకుతుంది. 6గంటల తర్వాత నోట్లోంచి నురగ రావటం, పాము కరిచిందని గుర్తించి ఆస్పత్రికి చేరేలోపు ప్రాణాలు పోతాయి. సందేహం వచ్చి దుప్పట్లు, పరుపులు వెతికితే కట్లపాము కనిపిస్తే గుర్తిస్తారు. లేదంటే గుర్తించటం కష్టం.

రక్తపింజర్లు, చిన్నపింజర్లతో ప్రమాదం

రక్తపింజర్లు, చిన్న పింజిర్లతో రైతులకు ఎక్కువగా ప్రమాదాలు అవుతుంటాయి. అందుకు కారణం అవి రాత్రి పూట సంచరించటమే. రక్తపింజర్లు, చిన్నపింజర్లను నిషాచరులుగా పిలుస్తుంటారు. గుట్టలు దగ్గరగా ఉన్న ప్రాంతాల్లో వీటి సంచారం అధికంగా ఉంటుంది. గ్రామాల్లోనూ రైతులు ధాన్యం కోసి రాశులుగా పోశాక వాటికోసం వచ్చే ఎలుకల కోసం ఇవి వస్తుంటాయి. కుప్పల కిందే ఉండి రైతు ధాన్యం తీస్తుండగా కాటు వేస్తాయి. అందుకే రైతులు పింజర్లతో అప్రమత్తంగా ఉండాలి.

గిరిజన డిగ్రీ కళాశాలలో ఆరు అడుగుల నాగుపాము

మండలంలోని మాచారం వద్ద ఉన్న గిరిజన సంక్షేమ బాలుర రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల (నాగర్‌కర్నూలు)లో ఇటీవల ఆరు అడుగల నాగుపాము విద్యార్థులను భయాందోళనకు గురిచేసింది. దాన్ని పట్టుకునేందుకు వెళ్లిన సదాశివయ్య బృందం విఫలమయ్యారు. అనంతరం దాన్ని చాకచక్యంగా పట్టుకున్నారు.

25 పాముల పట్టివేత

ఏప్రిల్ 1 నుంచి పట్టణంతో పాటు పరిసరాల్లో 10కి.మీ దూరంలోపు ఉన్న గ్రామాల్లో మొత్తం 25పాములు పట్టుకున్నారు. గ్రామాల్లో రైతులు చంపేసినవి మరెన్నో ఉంటాయి. ఆదివారం ఉదయం పట్టణంలోని చంద్రగార్డెన్ ఫంక్షన్‌హాల్ సమీపంలో జెర్రిపోతు జనావాసాల్లోకి రాగా పట్టుకున్నారు. జెడ్పీ వైస్‌చైర్మన్ కోడ్గల్ యాదయ్య ఇంటి సమీపంలో నాగుపాము బయటకు రాగా సదాశివయ్య బృందం వచ్చేలోగా ఎటో వెళ్లిపోయింది. ఇలా పట్టణంలోనూ పాముల బెడద పెరుగుతూనే ఉంది.

ఆరుబయట నిద్రించటం ప్రమాదకరం

పల్లెటూర్లలో వేసవికాలం ఆరుబయట పడుకోవటం పరిపాటి. ఇదే ప్రమాదంగా మారే అవకాశాలు ఉన్నాయి. పాములు బయట తిరిగే సమయంలో చాపలు, దుప్పట్లవైపుగా వస్తే పడుకున్న వారు చేతులు, కాళ్లు కదిలించటంతో పాములు బయపడి కాటు వేస్తాయి. అందుకే రాత్రిళ్లు బయట పడుకునే వారు తప్పనిసరిగా మంచాలు వేసుకుని పడుకోవటం వల్ల ప్రమాదాలు దరిచేరకుండా ఉంటాయి.



అప్రమత్తత అవసరం

వేసవిలో కురిసే వర్షాలకు పాములు బయటకు వస్తుంటాయి. అందుకే అప్రమత్తంగా ఉండాలి. ఆరుబయట పడుకునేవారు తప్పనిసరిగా మంచాల్లోనే పడుకోవాలి. రైతులు ధాన్యపు కుప్పలు తీసే సమయంలో చూసుకుని తీయాలి. పింజర్లు కుప్పలకింద వచ్చే ఎలుకల కోసం అక్కడే సేదతీరుతుంటాయి. పాము కనిపిస్తే చంపకుండా 9963536233 నంబర్‌కు సమాచారం ఇస్తే నా బృందంలో ఎవరైనా వచ్చి పట్టుకుంటాం. ఏప్రిల్ 1 నుంచి ఇప్పటి వరకు 25 పాములు పట్టుకున్నాం.

–డా.సదాశివయ్య, సర్పరక్షకుడు, డిగ్రీ కళాశాల, జడ్చర్ల

బోర్డు తిప్పేసిన చిట్‌ఫండ్ కంపెనీ

- ఎస్పీని ఆశ్రయించిన 58 మంది బాధితులు

వనపర్తి క్రైం: చిట్‌ఫండ్ కంపెనీ పేరుతో చిట్టీలు కట్టించుకొని తిరిగి చెల్లించకుండా బోర్డు తిప్పేసిన సంఘటన వనపర్తిలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. వనపర్తి జిల్లాకేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన అక్షర చిట్‌ఫండ్ కంపెనీ రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు 58 మందితో చిట్టీలు కట్టించుకుంది. చిట్టీ గడువు పూర్తయినా చెల్లించకుండా చిట్‌ఫండ్ కంపెనీ చుట్టూ నెలల తరబడి తిప్పించుకుంది. దీంతో బాధితులంతా చిట్‌ఫండ్ కంపెనీ యాజమాన్యం సభ్యులను నిలదీశారు. ఇటీవలే చిట్‌ఫండ్ కంపెనీ బోర్డు తిప్పేయడంతో బాధితులంతా ఎస్పీ రక్షితమూర్తిని ఆశ్రయించారు. ఎస్పీ సూచనతో పట్టణ పోలీస్ స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ యుగేంధర్‌రెడ్డి తెలిపారు.

తెలంగాణకు నెలకు ఓసారి అమిత్‌షా


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి

- మోసాలకు బ్రాండ్ అంబాసిడర్ కేసీఆర్
- నేడు నిరుద్యోగ మార్చ్‌కు ఉమ్మడి జిల్లా విద్యార్థులు, నిరుద్యోగులు, మహిళలు తరలిరావాలి
- మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి

పాలమూరు: కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తెలంగాణ గడ్డపై సింహం మాదిరి గర్జిస్తే.. ఇక్కడ ఉన్న నక్కలు భయపడ్డాయని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఏపీ జితేందర్‌రెడ్డి అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ గర్జన ఆగదని, నెలకు ఓసారి అమిత్ షా తెలంగాణకు వచ్చి వాళ్లను నిద్రపోనియడని, ఆయన నిద్రపోడని అన్నారు. 24గంటలు మోడీ, అమిత్ షా ప్రజల సంక్షేమం కోసం పని చేస్తున్నారని తెలిపారు. మోసాలకు బ్రాండ్ అంబాసిడర్ కేసీఆర్, ఆయన కుటుంబం అని విమర్శించారు. గూగుల్‌లో వరెస్ట్ సీఎం అని అడిగితే కేసీఆర్ పేరు వస్తోందన్నారు. ఈ ప్రభుత్వానికి దమ్ముంటే పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు లీగల్‌గా మొదట డీపీఆర్ తయారు చేసి ఇస్తే జాతీయ హోదా తీసుకువస్తామన్నారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు రావాల్సిన 511టీఎంసీల నీటి వాటా బదులు 299టీఎంసీలకు సీఎం కేసీఆర్ ఒప్పుకున్నాడన్నారు. నార్లాపూర్ దగ్గర ప్రారంభించిన ప్రాజెక్టుకు అనుమతి ఉందా? అటవీశాఖ అనుమతి ఉందా ప్రశ్నించారు. ఏదుల, వట్టెం, కరివెన, ఉదండాపూర్ వద్ద నిర్మిస్తున్న వాటికి అనుమతి తీసుకున్నావా అని ప్రశ్నించారు. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా బీజేపీ విజయం ఉంటుందని, కేసీఆర్, కేటీఆర్ తెలంగాణలో బీజేపీ అడుగుతున్నారని దుబ్బాక, హుజురాబాద్ దెబ్బలు మరిచిపోయారా అని అన్నారు. బీజేపీ పార్టీ ప్రతి ఇంట్లో, ప్రతి కార్యాలయంలో ఉందని బీజేపీ పార్టీ న్యాయం కోసం పోరాటం చేస్తోందన్నారు. గొల్కొండ ఖిల్లాపై బీజేపీ జెండా ఎగురుతుందన్నారు. అనంతరం బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వ మెడలు వంచడానికి బీజేపీ చేస్తున్న ప్రయత్నానికి ప్రతిఒక్కరూ కలిసి రావాలన్నారు. నేడు(మంగళవారం) పాలమూరులో నిర్వహించే నిరుద్యోగ మార్చ్ భారీ స్థాయిలో ఉంటుందని, దీనికి ఉమ్మడి జిల్లా నుంచి యువతీ, యువకులు తరలిరావాలన్నారు. విశ్వ విద్యాలయా విద్యార్థులు, మహిళలు, విద్యార్థులు అధికంగా రావాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌గౌడ్, రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్, జిల్లా అధ్యక్షుడు వీర బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు. అనంతరం నిరుద్యోగ మార్చ్ కార్యక్రమానికి సంబంధించి క్లాక్ టవర్ ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న సభ ఏర్పాట్లను సోమవారం రాత్రి బీజేపీ నేతలు పరిశీలించారు.

కడుపు నొప్పికి మాత్ర వేసుకుంటే.. ప్రాణం పాయె

జడ్చర్ల: కడుపు నొప్పి నివారణకు ఓ మాత్ర వేసుకుంటే తీవ్ర అస్వస్థతకు గురైన ఓ విద్యార్థిని ప్రాణాలు కోల్పోయింది. సీఐ రమేష్‌బాబు కథనం మేరకు.. జడ్చర్ల మండలం నసరుల్లాబాద్ గ్రామానికి చెందిన కాశమోని అఖిల(16) ఇటీవల 10వ తరగతి పరీక్షలు రాసింది. సోమవారం ఇంట్లో ఎవరూ లేనప్పుడు తీవ్ర అస్వస్థతతకు గురై అపస్మారక స్థితికి చేరుకుంది. గమనించిన కుటుంబసభ్యులు ఆమెను వెంటనే వైద్య చికిత్స కోసం బాదేపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందింది. చికిత్స సమయంలో తాను కడుపు నొప్పి నివారణకు మందుబిళ్ల వేసుకున్నట్లు డాక్టర్లకు చెప్పింది. మృతురాలు తండ్రి మల్లేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆడ పిల్లలు ధైర్యంగా ఉండాలి: ఆర్జేడీ విజయలక్ష్మి

బాలానగర్: ఆడపిల్లలు ధైర్యంగా ఉండాలని, ఎవ రికీ భయపడకూడదని ఆర్జేడీ విజయలక్ష్మి సూచించారు. సోమవారం మండలంలోని నేరళ్లపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌ను ఆర్జేడీ సందర్శించారు. విద్యార్థుల తో మాట్లాడుతూ.. వేసవిని దృష్టిలో ఉంచుకుని చెడు వ్యసనాలకు అలవాటుపడే వీలు లేకుండా ప్రతి రోజు గంట పాటు చదువుకోసం కేటాయించాలన్నారు. చూచిరాతలు రాయాలని, ఇంట్లో ఉన్నప్పుడు తల్లిదండ్రులకు పనుల్లో సాయం చేయాలని తెలిపారు. స బ్జెక్ట్ పరంగా ఉపాధ్యాయుల, ఉన్నత విద్యావంతుల సలహాలు తీసుకోవాలన్నారు. ఆమె వెంట ఎంఈఓ వెంకటయ్య, హెచ్‌ఎం పాండురంగారెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.